

ఆర్టీసీకి గి'రాఖీ'

రాఖీ పండుగ, వరుస సెలవులు రావడంతో మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌కు రికార్డు స్థాయి ఆదాయం సమకూరింది.

-8లో ▸



జూరాలకు వరద

ఎగువన కురుస్తున్న వర్షాలతో జూరాలకు మంగళవారం 1.05 లక్షల క్యూసెక్కుల వరద చేరినట్లు అధికారులు తెలిపారు.

-8లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /21.6

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముగిసిన రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



గద్వాలటౌన్: జిల్లా కేంద్రంలో మంత్రాలయ రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజైన మంగళవారం ఉత్తరారాధన ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర స్వామి బృందావనానికి పంచామృత అభిషేకం చేశారు. వివిధ రకాల పూలతో బృందావనాన్ని సుందరంగా అలంకరించారు. అదే విధంగా భీంనగర్‌లోని రాఘవేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

■ ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులు రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల సందర్భంగా అలంకరించిన స్వామివారి ఉత్సవ మూర్తిని పూల పల్లకీలో తీసుకెళ్లి రథంపై కొలువుదీర్చారు. షేరెల్లి వీధిలోని రాఘవేంద్రస్వామి మఠం నుంచి శేషదాస భజన మండలి సభ్యులు, భక్తుల పాటలు, భజనల మధ్య స్వామివారి ఊరేగింపు సాగింది. స్థానిక కోటలోని చెన్నకేశవస్వామి ఆలయం చుట్టూ రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ విచారణకర్త ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో బీజేపీకే అత్యధిక సభ్యత్వాలు



అయిజ: దేశంలో అత్యధిక సభ్యత్వాలు గల పార్టీ బీజేపీ అని జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. మంగళవారం అయిజలో బీజేపీ నాయకులు హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు సమష్టిగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గోపాలకృష్ణ, అక్కల రమాదేవి, వెంకటేశ్,, ఆంజనేయులు, లక్ష్మణ్‌గౌడ్, నర్సన్న, అంజి, రాజేశ్‌గౌడ్, శశికుమార్, పరశురాముడు, మహేశ్, రాజశేఖర్, గోపాల్, సుంకన్న పాల్గొన్నారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్లకు రెండో విడత శిక్షణ

గద్వాల: జిల్లాలోని లైసెన్స్‌డ్ సర్వేయర్లకు రెండో విడత శిక్షణ ఈ నెల 18నుంచి నిర్వహించనున్నట్లు భూ కొలతలు, సర్వేశాఖ ఏడీ రాంచందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 285 లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఉండగా.. ఇప్పటికే మొదటి విడత శిక్షణ పూర్తిచేయడం జరిగిందన్నారు. రెండో విడత 50 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

కానరాని పురోగతి!

సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ పనులపై కాలయాపన



నాలుగేళ్లుగా రిపేర్లకు నోచుకోని ర్యాలంపాడు రిజర్వాయర్

- వచ్చే ఏడాది నాటికి పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందడం గగనమే
- ఊసేలేని ర్యాలంపాడు రిజర్వాయర్ మరమ్మతు
- మంత్రుల సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యటనల్లో ప్రకటనలకే పరిమితం
- నేడు రాష్ట్ర సచివాలయంలో ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష

గద్వాల: పదేళ్ల క్రితమే పూర్తికావాల్సిన ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పనులు పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పెండింగ్ పనులను వచ్చే ఏడాది నాటికి పూర్తిచేసి.. ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని చెబుతున్న అమాత్యుల హామీలు కేవలం సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యటనల్లో ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఈ నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఉమ్మడి పాలమూరు జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల పనుల సమీక్షకు ప్రాధాన్యత సంతరించుకుంది.

కలెక్టర్లకు బాధ్యతలు అప్పగించినా..

గతేడాది సెప్టెంబర్‌లో జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రులకు జడ్చర్ల వద్ద పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం భూనిర్వాసితుల నుంచి పెద్దఎత్తున నిరసన సెగలు తగిలాయి. పెండింగ్ పనులు పూర్తి చేయాలంటే భూసేకరణ సమస్యను పరిష్కరించాలని గ్రహించిన మంత్రులు.. భూసేకరణ ప్రక్రియతో పాటు పెండింగ్ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వేగం పెంచాలని కలెక్టర్లకే బాధ్యతలు కట్టబెట్టారు. అయితే 10 నెలల కాలంలో ప్రాజెక్టుల పనుల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదు.

నెరవేరని లక్ష్యం

బీడు భూముల్లో సాగునీటిని పారించి వలసల పాలమూరు రూపురేఖలు మార్చాలని అప్పటి ముఖ్యమంత్రి దివంగత డా.వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞం కింద కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టారు. ఆ ప్రాజెక్టుల ద్వారా 10లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని సంకల్పించారు. అయితే వైఎస్సార్ అకాల మరణాంతరం పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టుల పనులను పూర్తిచేయకుండా వదిలేయడంతో పెండింగ్‌లోనే కొనసాగుతున్నాయి. ఫలితంగా 10 లక్షల ఎకరాలకు నీరందించాల్సిన ప్రాజెక్టుల కింద 6 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగునీరు పారుతోంది.

రిపేర్లపై నిర్లక్ష్యం..

నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి ర్యాలంపాడు జలాశయం గుండెకాయలాంటిది. అయితే రాక్‌టోల్, తూములు, ఆనకట్ట బండ్‌లో లీకేజీలు ఏర్పడటంతో నాలుగేళ్లుగా 2 టీఎంసీలు మాత్రమే నిల్వచేస్తూ వస్తున్నారు. కేవలం వానాకాలంలో మాత్రమే సాగునీటిని అందిస్తూ వస్తున్నారు. గతేడాది పుణెకు చెందిన ఇంజినీరింగ్ నిపుణుల బృందం ర్యాలంపాడు రిజర్వాయర్‌ను సందర్శించి.. మరమ్మతుకు రూ.185కోట్లు వ్యయం అవుతుందని నివేదించారు. దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి చలనం లేదు.

కోయిల్‌సాగర్‌ది అదే తీరు..

మరికల్, ధన్వాడ, చిన్నచింతకుంట, దేవరకద్ర మండలాల పరిధిలో 50 వేల ఎకరాలకు సాగునీటిని అందించాలనే లక్ష్యంతో కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టారు. గత పాలకులు కోయిల్‌సాగర్ పనులను పూర్తిచేయకపోవడంతో నేటికీ పెండింగ్‌లోనే ఉంది. మరోవైపు జూరాల ప్రాజెక్టుకు భారీ వరద కొనసాగుతున్న క్రమంలో మోటారు పంపులలో తరచుగా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక్కడ కూడా నిర్వహణ లోపమే ప్రధాన కారణం.

నెట్టెంపాడుకు భూ సేకరణే అడ్డంకి..

నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం పనులు పదేళ్ల క్రితమే 90 శాతం పూర్తయ్యాయి. అయితే 99, 100 ప్యాకేజీల్లో భూసేకరణ సమస్య నెలకొనడతో కలెక్టర్ సంతోష్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. మొత్తం 2 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాల్సి ఉండగా.. గూడ్డెందొడ్డి, ర్యాలంపాడు జలాశయాల కింద 1.45 ఎకరాలకు సాగునీరు అందుతోంది. మోటార్ల నిర్వహణ కొరవడటంతో తరచుగా సాంకేతిక సమస్యలు తలెత్తి నీటి పంపింగ్‌కు ఆటంకాలు ఏర్పడటం పరిపాటిగా మారింది.

అదే దారిలో భీమా..

నారాయణపేట జిల్లాలో 4లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో చేపట్టిన భీమా ఎత్తిపోతల పథకం పనులు సైతం పెండింగ్‌లో కొనసాగుతున్నాయి. ఫలితంగా పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీటిని అందించలేని పరిస్థితి నెలకొంది.

కొనసా..గుతున్న 'పాలమూరు'..

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. సివిల్, మెకానికల్ పనులు పూర్తిచేయాల్సి ఉంది. అదే విధంగా పలు రిజర్వాయర్ల కింద భూ సేకరణకు సంబంధించి సమస్యలు పెండింగ్‌లో కొనసాగుతున్నాయి.

నేడు సమీక్ష..

హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులపై సమీక్షించనున్నారు. ఉదయం సెషన్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ప్రాజెక్టులు, మధ్యాహ్నం సెషన్‌లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రాజెక్టులపై సమీక్షిస్తారు.

సమీక్షలతో ప్రయోజనం లేదు..

నెట్టెంపాడు పెండింగ్ పనులు, ర్యాలంపాడు రిపేర్లు, గట్టు ఎత్తిపోతల పనులపై ఇరిగేషన్‌శాఖ అధికారులు, మంత్రికి నేరుగా పలుమార్లు విన్నవించడం జరిగింది. క్షేత్రస్థాయిలో మంత్రులు పర్యటించి వెళ్లారు. అయితే ప్రాజెక్టుల పెండింగ్ పనులు ముందుకు సాగడం లేదు. ర్యాలంపాడు రిజర్వాయర్ రిపేర్లపై ఊసే ఎత్తడం లేదు. మంత్రుల సమీక్షలు, పర్యటనలతో ప్రయోజనం లేదు. పనులు జరిగి ఆయకట్టుకు నీరందితేనే రైతులకు మేలు జరుగుతుంది.

– బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, గద్వాల

కేఎల్ఐ పూర్తయ్యేదెన్నడో?

4.50 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలనే లక్ష్యంతో నిర్మాణం చేపట్టిన కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులు అసంపూర్తిగానే ఉండగా.. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు కింద 2.50 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నారు. ఇందుకోసం మొత్తం 5 పంపులు ఏర్పాటు చేయగా.. వివిధ కారణలతో రెండుపంపులు మరమ్మతుకు గురై మూలకు చేరాయి. కేఎల్ఐ పెండింగ్ పనులు పూర్తయితే మరో 2లక్షల ఆయకట్టు సస్యశ్యామలంగా మారనుంది.



కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టు మొదటి లిఫ్టు

● పరిహారం.. ఫలహారం!

కదిలిస్తే కన్నీరే..



వీరందరూ వనపర్తి జిల్లా రేవల్లి మండలంలో ముంపు గ్రామమైన బండరాయిపాకులకు చెందిన సామాన్య, మధ్య తరగతికి చెందిన ప్రజలు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన ఏదుల ప్రాజెక్ట్ నిర్మాణంలో వ్యవసాయ భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు. ప్రభుత్వం ఇచ్చిన అరకొర పరిహారాన్ని ఓం శ్రీ సాయిరాం ఫైనాన్స్ కంపెనీ నిర్వాహకులు గద్దలా తన్నుకుపోవడంతో గుండెలు బాదుకుంటున్నారు. నెలనెలా వడ్డీ వస్తుందనే ఆశ నిండా ముంచడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. తాము చెల్లించిన డబ్బులను ఇవ్వాలని ఐదేళ్లగా ఆందోళన చేస్తున్నా.. ఫలితం లేకపోవడంతో వారిలో ఆగ్రహావేశాలు పెల్లుబికుతున్నాయి.

..ఇలా మోసపోయింది ఈ ఒక్క గ్రామస్తులే కాదు. వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల పరిధిలో దాదాపు 50 గ్రామాలకు చెందిన పీఆర్ఎల్ఐ నిర్వాసితులు 2,500 మంది ఉన్నట్లు అంచనా. డబ్బులు వస్తలేవనే మనోవేదనతో ఇప్పటికే పలువురు బలవన్మరణాలకు పాల్పడగా.. కొందరు గుండెనొప్పితో తనువు చాలించారు. ఈ నేపథ్యంలో బాధిత నిర్వాసితులను 'సాక్షి' పలకరించగా.. కన్నీళ్లే మిగిలాయి. అనారోగ్య కారణాలతో మంచమెక్కిన వారు.. వైద్య చికిత్సలకు డబ్బులు లేక విలవిల్లాడుతున్నారు. ఇళ్లు కట్టుకోలేక, సంతానాన్ని పోషించలేక, చదివించలేక నరకయాతన అనుభవిస్తున్నారు. బాధితులు ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాథ కాగా.. వారి ఆవేదన వారి మాటల్లోనే..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

- ఫైనాన్స్ మోసంతో పీఆర్ఎల్ఐ నిర్వాసితుల విలవిల
- ఇప్పటికే కొందరి బలవన్మరణం.. గుండెనొప్పితో తనువు చాలించిన మరికొందరు..
- వైద్య చికిత్సలకు డబ్బుల్లేక మంచానికే పరిమితమైన ఇంకొందరు..
- ఇళ్లు కట్టుకోలేక..పిల్లలను చదివించలేని దుస్థితిలో పలువురు..
- ఆలనాపాలన కరువై ఆదుకునే వారి కోసం వృద్ధుల ఎదురుచూపులు..

నాన్న దూరమయ్యాడు.. కుటుంబం రోడ్డున పడింది..



మా నాన్న రాంచంద్రయ్య ఓం శ్రీ సాయిరాం చిట్‌ఫండ్‌లో రూ.13 లక్షలు పెట్టాడు. ఆ తర్వాత ఆయనకు ఆరోగ్యం బాగాలేకపోతే ఆస్పత్రికి తీసుకెళ్లాం. ఫైనాన్స్‌వాళ్లను ఎన్నిసార్లు అడిగినా డబ్బులు ఇవ్వకపోయేసరికి మనోవేదనతో మంచానపడ్డాడు. దీంతో వైద్య ఖర్చులకు ఆయనపై ఉన్న ప్లాటు అమ్మాల్సి వచ్చింది. ఈ క్రమంలో మా నాన్న గుండెపోటు వచ్చి మరణించాడు. ఇప్పుడు మాకు ఇల్లులేదు. డబ్బుల కోసం నా భార్యకు నాకు గొడవ జరిగింది. వీళ్లతో డబ్బులు పెట్టడం వల్ల మా నాన్న నాకు దూరమయ్యాడు. నా కుటుంబం రోడ్డున పడింది. ప్రస్తుతం ఉండేందుకు ఇంటి స్థలం కూడా లేదు.

– కుర్మయ్య, బాధితుడు

క్యాన్సర్ పేషంట్‌ను.. గోలీలకూ డబ్బుల్లేవు..



పాత బండరాయిపాకులలో మాకు ఐదెకరాల భూమి ఉండేది. పాలమూరు ప్రాజెక్ట్‌తో ఉన్నది పోయింది. ప్రభుత్వం నుంచి డబ్బులు వచ్చాక సాయిరాం ఫైనాన్స్ వాళ్లు నా కొడుకును కలిసిండ్రు. మిత్తి ఎక్కువగా వస్తుందని మాయమాటలు చెప్పి బాగా నమ్మించిండ్రు. దీంతో నా కొడుకు రాములు పేరిట రూ.10 లక్షలు, నా కోడలు గోపాల శివశీల పేరిట రూ.5 లక్షలు, నేను దాచుకున్న రూ.1.50 లక్షలు.. మొత్తం రూ.16.50 లక్షలను 2021లో ఫైనాన్స్ కంపెనీలో డిపాజిట్ చేశాం. ఒకసారి రూ.60 వేలు, మరోసారి రూ.30 వేలు వడ్డీ కింద ఇచ్చారు. ఆ తర్వాత ఆరోగ్యం బాలేదని డబ్బులు అడిగితే ఇవ్వడం లేదు. కొన్ని రోజుల క్రితం హైదరాబాద్ ఆస్పత్రికి వెళ్తే క్యాన్సర్ వచ్చిందని చెప్పారు. మళ్లీ ఆస్పత్రికి వెళ్లేందుకు, గోలీలకు డబ్బుల్లేవ్. ఫికరుతో ఎప్పుడు సచ్చిపోతనో నాకే తెలుస్తలేదు.

– గోపాల బొజ్జమ్మ, బండరాయిపాకుల, రేవల్లి, వనపర్తి

అతికష్టం మీద బతుకుతున్నాం..



నా పేరు, నా భర్త మీద రూ.6 లక్షలను 2021లో ఓం శ్రీసాయిరాం ఫైనాన్స్ కంపెనీలో పెట్టాం. మాకు నలుగురు కొడుకులు ఉండగా.. ముగ్గురు మరణించారు. ఒక్క కొడుకు మాత్రమే ఉన్నాడు. మాతో డబ్బులు లేకపోయేసరికి మమ్మల్ని ఎవరూ చూసుకోవడం లేదు. ఉన్న కొడుకు కూడా విడిగా ఉంటున్నాడు. నాకు పక్షవాతం వచ్చింది. ఒక కన్ను సరిగా కనిపించడం లేదు. అతికష్టం మీద బతుకుతున్నాం. డబ్బులు అనవసరంగా ఎవరికో ఇచ్చి ఇలా చేశారని కొడుకు, కోడలు నిత్యం తిడుతూనే ఉన్నారు. మాకు డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలి.

– మిద్దె నాగమ్మ, బాధితురాలు

కిరాయి ఇంట్లో ఉంటున్నాం..



తెలిసిన వాళ్లు మిత్తి వస్తుందని చెబితే.. మాకు పునరావాసం కోసం వచ్చిన డబ్బులు మొత్తం రూ.24 లక్షలను ఓం శ్రీ సాయిరాం చిట్‌ఫండ్‌లో నాలుగేళ్ల క్రితం పెట్టాం. ఇప్పటివరకు మాకు చిల్లిగవ్వ ఇవ్వలేదు. డబ్బులు లేక మేము ఇల్లు కట్టుకోలేదు. కిరాయికి వేరొకరి ఇంట్లో ఉంటున్నాం. నేనూ మా ఆయన ఇద్దరం కూలీ చేసుకుని బతుకుతున్నాం. మా పరిస్థితి ఇలా ఉంటే.. దుద్దు మల్లయ్య అనే వాళ్లతో రూ.2.60 లక్షలు కట్టించాను. ఇప్పుడు వాళ్లు డబ్బులు ఇవ్వాలని నన్ను టార్చర్ పెడుతున్నారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలి.

– గోపాల పార్వతమ్మ, బాధితురాలు


ఎవరైనా పెడితేనే తింటున్న..



నేను పని చేయలేను కాబట్టి నెలనెలా మిత్తి వస్తే ఖర్చులకు సరిపోతాయి.. బతకొచ్చు అనుకుని వచ్చిన డబ్బులను నా పేరు మీద రూ.5 లక్షలు ఫైనాన్స్‌లో పెట్టాను. నా కూతుళ్ల లక్ష్మీ రూ.5 లక్షలు, రుక్మమ్మ రూ.6 లక్షలు.. మొత్తం రూ.16 లక్షలు పెట్టాం. మొదట్లో మిత్తి డబ్బులు 2 నెలలు ఇచ్చాడు. ఆ తర్వాత మిత్తి లేదు.. అసలు లేదు నాకు ప్రస్తుతం అన్నం కూడా సరిగా పెట్టడం లేదు. ఎవరైనా బయట పెడితే తింటున్న.. గుడిసెలో వెళ్లి పడుకుంటున్నా.

– భగవంతు, బాధితుడు

డబ్బుల్లేక మందులు తెచ్చుకోలేకపోతున్నాం..



నా భార్య పేరు మీద రూ.11 లక్షలు, నా పేరు మీద రూ.2 లక్షలు.. మొత్తం రూ.13 లక్షలు ఫైనాన్స్‌లో పెట్టాం. మాకు నలుగురు కూతుళ్లు. అందరి పెళ్లిళ్లు అయ్యాయి. ప్రస్తుతం మమ్మల్ని ఎవరూ చూడనీకే రావడం లేదు. నా భార్యకు చేయి విరిగింది. డబ్బుల్లేక మందులు తెచ్చుకోలేకపోతున్నాం. మా డబ్బులు మాకివ్వమని ఎవర్ని అడగాలో తెలియడం లేదు. మా మీద కనికరం చూపించి డబ్బులు ఇప్పించాలి.

– బింగి లింగయ్య, పాపమ్మ దంపతులు

ఉపాధ్యాయుడిగా మారిన కలెక్టర్



పూడూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పాఠం చెబుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల/గద్వాలటౌన్: పిల్లలూ ఎలా చదువుతున్నారు.. ఇంగ్లిష్ చదవడం వచ్చా.. అంటూ విద్యార్థులను పలకరించారు కలెక్టర్ సంతోష్. ఆయన అడిగిన ప్రశ్నకు వచ్చు సార్ అంటూ విద్యార్థులు బదులిచ్చారు. మంగళవారం గద్వాల మండలం పూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓ తరగతి గదిలోకి కలెక్టర్ వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులచే పాఠాలు చదివించారు. టీచర్లు బాగా చెబుతున్నారా అని అడిగి సమాధానాలు రాబట్టారు. పదో తరగతి విద్యార్థులు చాలా మంది ఇంగ్లిష్‌లో చదివిన దానికి అర్థం చెప్పకపోవడంతో అసంతృప్తి వ్యక్తంచేశారు. చదువులో వెనకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. అంతకుముందు ఉపాధ్యాయుల హాజరు పట్టిక, విద్యార్థుల ఫేషియల్ రికగ్నిషన్, వంటగది, తాగునీరు, భోజనం నాణ్యత, స్టోర్‌రూంలోని సరుకులను కలెక్టర్ పరిశీలించారు. యూడైస్ ఎంట్రీలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని హెచ్‌ఎంకు సూచించారు. ఆహార పదార్థాలు, కూరగాయలు నాణ్యతగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్య విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్మికశాఖ కమిషనర్ మహేశ్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ప్రియాంక, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు ఉన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి..

భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు ప్రమాదకర పరిస్థితులు తలెత్తనప్పటికీ.. రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వరదలతో పొంగిపొర్లే వాగులు, వంకల వద్ద ప్రమాదాలు సంభవించకుండా చూడాలన్నారు. ప్రమాదాల నివారణ కోసం మండలస్థాయి బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. అదే విధంగా సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ ఎస్ఈ రహీముద్దీన్, డీపీఓ నాగేంద్రం, డీఎంహెచ్ఓ డా.సిద్దప్ప, డీఏఓ సక్రియా నాయక్ ఉన్నారు.

■ రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి ఆయన కలెక్టర్లతో వీసీ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ, ఇరిగేషన్‌శాఖ ఎస్ఈ రహీముద్దీన్, విద్యుత్‌శాఖ డీఈ తిరుపతిరావు, డీఎంహెచ్ఓ సిద్దప్ప, డీఏఓ సక్రియానాయక్ ఉన్నారు.

వసతిగృహాల్లో సమస్యల పరిష్కారానికి కృషి



హాస్టళ్ల వార్డెన్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: ప్రభుత్వ వసతిగృహాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మంగళవారం కర్నూలులోని తన క్యాంపు కార్యాలయంలో ఎస్సీ, బీసీ వసతిగృహాల వార్డెన్‌లతో ఆయ సమీక్షించారు. ఈ సందర్భంగా హాస్టళ్ల వారీగా నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం అయిజ మండలం టీటీదొడ్డికి చెందిన ఉరుకుందమ్మకు శస్త్రచికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి మంజూరైన రూ. 5లక్షల ఎల్‌ఓసీ, అదే గ్రామానికి చెందిన ఎద్దుల రాముడు శస్త్రచికిత్స నిమిత్తం రూ. 2.20లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే అందజేశారు.

రైస్‌మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు

గద్వాల: కేటీదొడ్డి మండలంలోని ఓ రైస్‌మిల్లులో మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు స్టేట్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. 2024–25 వానాకాలం, యాసంగి సీజన్‌ల్లో కేటాయించిన ధాన్యం బస్తాలతో సహా లెక్కించినట్లు సమాచారం. అయితే రెండు రోజులుగా రైస్‌మిల్లుల్లో విజిలెన్స్ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా తనిఖీలు నిర్వహించడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. యాసంగి సీజన్‌లో సదరు మిల్లుకు కేటాయించిన ధాన్యం పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించడం గమనార్హం. యాసంగికి సంబంధించిన వరిధాన్యం పూర్తిస్థాయిలో మిల్లులో లేకపోవడం అనుమానాలకు దారి తీస్తోంది. విజిలెన్స్ అధికారుల తనిఖీలపై జిల్లా సివిల్ సప్‌లై అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

క్లుప్తంగా

ఫంక్షన్‌హాల్‌లో కిందపడి వ్యక్తి మృతి


ద్యావరి వెంకటయ్య (ఫైల్)

గోపాల్‌పేట: ఫంక్షన్‌హాల్‌లో వేడుకకు హాజరై అన్నం తిన్న తర్వాత చేతులు కడుక్కునేందుకు వెళ్లి ఓ వ్యక్తి హఠాన్మరణం చెందిన ఘటన చోటుచేసుకుంది. గోపాల్‌పేట ఎస్‌ఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. ఏదుల మండల కేంద్రానికి చెందిన ద్యావరి వెంకటయ్య(64), అదే గ్రామానికి చెందిన కొమ్ము వెంకటయ్యతో కలిసి గోపాల్‌పేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరుగుతున్న నిశ్చితార్థానికి వెళ్లి.. అక్కడే మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో భోజనం చేశాడు. అనంతరం చేతులు కడుకునేందుకు వెళ్లి కాలుజారి కిందపడి మరణించాడు. ఘటనపై మంగళవారం మృతుడి భార్య ద్యావరి అలివేల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాము కాటుతో చిన్నారి మృత్యువాత


గౌతమి (ఫైల్)

అడ్డాకుల: ఓ చిన్నారి పాము కాటుకు గురై మృతిచెందిన ఘటన మూసాపేట మండలం నందిపేటలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దొడ్ల ఆంజనేయులు కుమార్తె గౌతమి (9) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. సోమవారం పాఠశాలకు వెళ్లి ఇంటికి వచ్చిన తర్వాత రాత్రి భోజనం చేసి తల్లిదండ్రులతో కలిసి పడుకుంది. మంగళవారం తెల్లవారుజామున బాలికకు పాము కరవడంతో ఉదయం వాంతులు, విరేచనాలు అధికమయ్యాయి. వెంటనే తల్లిదండ్రులు దేవరకద్రలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో 108 వాహనంలో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. పాప మృతితో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఇదే ఇంట్లో ఏడాది కిందట పాప నానమ్మ కూడా పాము కాటుకు గురై మృతిచెందింది.

నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

మద్దూరు: ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా ఒకటైన తర్వాత ప్రియుడు మాట మార్చడంతో మోసపోయానని భావించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని దోరేపల్లికి చెందిన ఓ యువతి (21) ఇదే గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటయ్య ఐదేళ్లగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకోవాలని యువతి ఒత్తిడి చేయడంతో వెంకటయ్య దాట వేసే ప్రయత్నం చేస్తుండడంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో పశువులు మృతి



కోడేరు: విద్యుదాఘాతంతో నాలుగు పశువులు మృతి చెందిన ఘటన మండలంలోని బాడిగదిన్నె గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బైరపోగు చిన్నబొజ్జన్న పశువులు రెండు, ఆనందం లోకేశ్వరి రెండు పశువులను మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఓ వ్యవసాయ పొలంలో మేపుతుండగా.. వర్షానికి తెగిపడిన విద్యుత్ వైరును పశువులు తొక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. ప్రమాదంలో దాదాపు రూ.4లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు. ప్రభుత్వం నుంచి తమను ఆదుకోవాలని కోరారు.

ఉరకలేస్తున్న ఊకచెట్టు వాగు



రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు వాగులు, కుంటలు పారుతున్నాయి. జిల్లాలోని దుప్పల్లి సమీపంలో ఉన్న ఊకచెట్టు వాగుకు ఎగువ ప్రాంతమైన చిన్నచింతకుంట, వడ్డెమాన్, మన్నెవాగు, బండర్‌పల్లి వాగు నుంచి వరద రావడంతో చెక్‌డ్యాం నిండిదిగువకు పారుతోంది. సరళాసాగర్ జలాశయం కూడా బుధవారం రాత్రి వరకు పూర్తిస్థాయిలో నిండి సైఫన్లు తెర్చుకునే అవకాశం ఉంది. శంకరమ్మపేట, మదనాపురం, రామన్‌పాడు, అజ్జకొల్లు, కొత్తపల్లి, లక్ష్మీపురం, నెల్విడి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జేకే మోహన్ సూచిస్తున్నారు. – మదనాపురం

ఏటి చెరువుకు జలకళ



మహమ్మదాబాద్ మండలంలోని గాధిర్యాల్ ఏటి చెరువు అలుగు పారుతుండటంతో చుట్టుపక్కల గ్రామాల రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చాలా రోజులకు చెరువు అలుగు పారడంతో చూసేందుకు వచ్చిన వారితో మంగళవారం చెరువు పరిసరాలు కిటకిటలాడాయి. చెరువు నిండటంతో పరిసరాల్లోని బోరుబావులకు జీవం పోసినట్లయిందని, రెండుమూడేళ్ల పాటు సాగునీటికి ఇబ్బందులు తొలగిపోయాయని రైతులు ఆనందం వ్యకం చేస్తున్నారు. – మహమ్మదాబాద్

సాలార్‌నగర్.. జలసవ్వడి



ఇటీవల కురిసిన వర్షాలకు గండేడ్ మండలంలోని సాలార్‌నగర్ ప్రాజెక్టు పూర్తిగా నిండి మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు అలుగు పారింది. దీంతోపాటు కొండెడ్డిపల్లి సుత్తుకుంట, చింతలకుంటలు కూడా అలుగు పారుతున్నాయి. చిన్నవార్వాల్ ఉప్పు చెరువు 85 శాతం, గండేడ్ దేవుల్ చెరువు 80 శాతం, రెడ్డిపల్లి రెడ్డిచెరువు 75 శాతం, బల్సూర్‌గొండ నల్లచెరువు 75 శాతం నిండాయి. వెన్నాచేడ్ పెద్దచెరువు, రెడ్డిపల్లి మల్లయ్య చెరువు, జంగంరెడ్డిపల్లి దేవుని చెరువు, పగిడ్యాల్ మల్లమ్మ చెరువు తదితర గ్రామాల చెరువుల్లో కొంతమేర వర్షపు నీరు చేరింది. అన్ని చెరువులు, కుంటలు జళకళను సంతరించుకున్నాయి. – గండేడ్

జూరాలకు కొనసాగుతున్న వరద


జూరాల ప్రాజెక్టులో నిల్వ నీరు

- 1.05 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ప్రాజెక్టు 10 క్రస్టు గేట్ల ఎత్తివేత
- 1.05లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు..

ధరూరు: ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు మంగళవారం రాత్రి 7 గంటల వరకు 1.05 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 10 క్రస్టు గేట్లను ఎత్తి 68,580 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 36,541 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 45 క్యూసెక్కులు, కుడి కాల్వకు 236 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 1.057 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.203 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆల్మట్టి ప్రాజెక్టుకు పూర్తి స్థాయి నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 121.957 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 1.22 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు పూర్తి స్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 32.74 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 25వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 4 క్రస్టు గేట్లను ఎత్తి 19,920 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

మూడేళ్ల అనంతరం..

ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రంలో 2023లో మొరాయించి పని చేయకుండా ఉన్న మూడో యూనిట్ ఎట్టకేలకు మంగళవారం వినియోగంలోకి వచ్చింది. తెల్లవారుజామున ఎస్‌ఈ శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మూడో యూనిట్ ద్వారా విద్యుదుత్పత్తిని విజయవంతంగా ప్రారంభించారు.

సుంకేసులకు..

రాజోళి: సుంకేసుల ప్రాజెక్టుకు 60వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 13 గేట్లను ఒక మీటర్ మేర తెరిచి 56,927 క్యూసెక్కులను దిగువకు, కేసీ కెనాల్ 2,012 క్యూసెక్కులను విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

473.254 మి.యూ విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో మంగళవారం 12 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల ద్వారా 216.545 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 256.709 మిలియన్ యూనిట్లు కలిపి 473.254 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు.

భక్తుల ఆరాధ్యదైవం గెల్వాలాంబమాత

- నేటి నుంచి 17 వరకు బ్రహ్మోత్సవాలు
- ఐదు రోజులపాటు బోనాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థాన కమిటీ


అలంకరణలో గెల్వాలాంబమాత

వంగూరు: మండల కేంద్రంలో కొలువుదీరిన గెల్వాలాంబమాత ఉత్సవాలు ఈనెల 13 నుంచి 17 వరకు ఐదు రోజులపాటు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు సంబంధించి దేవస్థాన కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ అలంకరణ, విద్యుద్దీకరణ, తాగునీరు, ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 13న అమ్మవారి మేలుకొలుపు, తోరణ అలంకరణ, గణపతి పూజ, సాయంత్రం నజర్ బోనాలు, వైశ్యుల బోనాలు, అనంతరం బండ్లు, వాహనాలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తాయి. 14న అమ్మవారికి గండదీపం, సాయంత్రం రెడ్లు, పద్మశాలిలు, బోయ, గౌడ్స్, యాదవుల బోనాలు అమ్మవారికి సమర్పిస్తారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ, కోలాటాలు, భజనలు ఉంటాయి. 15 ఉదయం పూజా కార్యక్రమాలు, సాయంత్రం ముదిరాజ్‌ల బోనాలు, బండ్లు తిరుగుతాయి. 16 తెల్లవారుజామున రథోత్సవం, శ్రీకృష్ణ జననం, డోలారోహణం ఉంటుంది. 17 సాయంత్రం యాదవులు ఉట్టి కొట్టుట, బాలబాలికల చేత శ్రీకృష్ణ, గోపికల వేషాధారణ. అనంతరం మహామంగళహారతితో జాతర ముగుస్తుంది.

■ ఉత్సవాల్లో భాగంగా 14న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క హాజరవుతారని దేవస్థాన కమిటీ చైర్మన్ నకిరమోని శేఖర్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ దంపతులు రెండు రోజులపాటు ఉత్సవాల్లో పాల్గొంటారు.

■ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 14న రాత్రి పలువురు ప్రత్యేక ఫోక్ సింగర్లచేత ఆటాపాట నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

సస్పెండ్ అయినా.. సగం జీతం వస్తుందిలే!


మద్యం మత్తులో వాటర్‌ట్యాంకు వద్ద నిద్రించిన ఉపాధ్యాయుడు రవిచందర్


విచారణ చేస్తున్న ఎంఈఓ భగీరథరెడ్డి

మద్యం మత్తులో మాస్టారు సమాధానానికి అవాక్కైన ఎంఈఓ

రాజోళి: ''సస్పెండ్ అయితే ఏంటి.. సగం జీతం వస్తుంది కదా.. దాంతో జీవితాన్ని సరదాగా గడిపేస్తా'' అని చిన్నధన్వాడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రవిచందర్ సమాధానమివ్వడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'లంచం ఇచ్చే విధుల్లోకి వచ్చా' కథనానికి ఎంఈఓ భగీరథరెడ్డి స్పందించారు. ఈ మేరకు చిన్నధన్వాడ ప్రాథమిక పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుడు రవిచందర్ తీరుపై విచారణ చేపట్టారు. అప్పటికే సదరు ఉపాధ్యాయుడు ఫూటుగా మద్యం తాగి వాటర్‌ట్యాంక్ వద్ద ఏదీ గుర్తులేకుండా నిద్రించాడు. ఎంఈఓ విద్యార్థులతో వివరాలు సేకరించగా.. తరగతి గదిలోనే మద్యం తాగి నిద్రిస్తాడని.. మద్యం మత్తులో తమను ఇష్టం వచ్చినట్లు తిడతాడని విద్యార్థులు ఎంఈఓతో వాపోయారు. ఈ క్రమంలోనే వాటర్‌ట్యాంక్ వద్ద మద్యం మత్తులో నిద్రిస్తున్న సదరు ఉపాధ్యాయుడిని పాఠశాల వద్దకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓతో అతడు మాట్లాడుతూ.. ప్రక్కతిలో ఉన్న సమస్యల కారణంగా పిల్లల సంఖ్య తగ్గుతుందని, అందుకు తామేమి చేస్తామని బదులిచ్చారు. అయితే విద్యార్థులతో పుస్తకాలు చదివించమని ఎంఈఓ సూచించగా, మద్యం మత్తులో ఊగుతూ.. తూగుతూ నానా తంటాలు పడ్డాడు. పాఠశాలలోనే మద్యం తాగే నీపై చర్యలు తప్పవని ఎంఈఓ అనగా.. పర్లేదు సార్ సస్పెండ్ అయినా సగం జీతం వస్తుందిలే అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. అనంతరం ఎంఈఓ 'సాక్షి'తో మాట్లాడుతూ.. తమ విచారణలో సదరు ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలన్నీ వాస్తవాలే అని అన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే, గతంలో కూడా విచారణ చేసి వదిలేశారని.. ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకుంటారో లేదోనని గ్రామస్తులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

నీటి ఉధృతికి కొట్టుకుపోయిన బైక్


కొట్టుకుపోతున్న ద్విచక్ర వాహనాన్ని నిలువరిస్తున్న యజమాని

నాగర్‌కర్నూల్ క్రైం: నీటి ఉధృతికి ద్విచక్రవాహనం కొట్టుకుపోయిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని నాగనూలు సమీపంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకోగా.. ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాగనూలు సమీపంలోని కల్వర్టులో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో నాగనూలు గ్రామానికి చెందిన శివ ద్విచక్రవాహనంతో రోడ్డు దాటేందుకు ప్రయత్నించగా.. ప్రమాదవశాత్తు నీటిలో పడిపోవడంతో అక్కడే ఉన్న స్థానికులు బాధితుడిని కాపాడగా ద్విచక్రవాహనం కొట్టుకుపోయింది. ఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చెంచు మహిళకు అరుదైన గౌరవం


ఢిల్లీ వెళ్తున్న భౌరమ్మ, వెంకటయ్య దంపతులు

మన్ననూర్/జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): నల్లమల్ల చెంచు మహిళకు అరుదైన గౌరవం దక్కింది. దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకొండ వద్ద 15వ తేదీన జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ చెంచు మహిళా సమాఖ్య నుంచి అటవీ లోతట్టు ప్రాంతం కుడిచింతలబైలు గ్రామానికి చెందిన భౌరమ్మ పాల్గొననుంది. సెర్ప్ సీఈఓ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం సికింద్రాబాద్ నుంచి రైలులో భౌరమ్మ ఆమె భర్త వెంకటయ్య ఢిల్లీకి బయలుదేరారు. డీఆర్డీఓ అధికారులు ఆమెకు అభినందనలు తెలిపారు. గొప్ప వాళ్లకు లభించే అవకాశం తనకు రావడం సంతోషంగా ఉందని.. అవకాశం కల్పించిన సెర్ప్ అధికారులు, డీఆర్డీఓ అధికారులకు భౌరమ్మ ధన్యవాదాలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి ఎర్రకోట ఆహ్వానం


దస్తగిరిని సన్మానిస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

ఉండవెల్లి: మండలంలోని బైరాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి దస్తగిరికి అరుదైన ఆహ్వానం అందింది. 2021–22 ఆర్థిక సంవత్సరం పేదరిక నిర్మూలన కార్యక్రమానికి సంబంధించి రాజోళి మండలం మాన్‌దొడ్డి గ్రామం జాతీయస్థాయిలో ద్వితీయ స్థానం సాధించినందుకుగాను ఆయనకు ఆహ్వానం అందినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి దస్తగిరిని ఎంపీడీఓ తిరుపతన్న, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు.

బల్మూర్ కేజీబీవీలో హైడ్రామా

- కత్తి పీటలతో వంట కార్మికుల ఘర్షణ
- మందలించిన ఎస్‌ఓపై తిరగబడిన వైనం
- మద్యం మత్తులో వర్కర్లు ఇబ్బంది పెడుతున్నారని విద్యార్థుల ఆవేదన

బల్మూర్: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం హైడ్రామా చోటు చేసుకుంది. కేజీబీవీలో పనిచేస్తున్న వంట కార్మికుల మధ్య విబేధాలు తలెత్తడంతో ఒకరిపై ఒకరు కత్తి పీటలతో ఘర్షణకు దిగారు. సమాచారం అందుకున్న ఎస్‌ఓ లలిత కేజీబీవీకి చేరుకొని వంట కార్మికులను మందలించగా.. ఆమెపై తిరగబడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. కేజీబీవీలో పనిచేస్తున్న ముగ్గురు వంట కార్మికులు డ్యూటీల విషయంలో గొడవ పడ్డారు. ముగ్గురి మధ్య మాటామాట పెరిగి కత్తి పీటలతో దాడులు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు ఎస్‌ఓ లలితకు సమాచారం అందించడంతో ఆమె అక్కడికి చేరుకొని ముగ్గురు కార్మికులను మందలించింది. అప్పటి వరకు ఘర్షణకు దిగిన వర్కర్లు.. తమపై ఎస్‌ఓ దాడి చేశారని ఒక్కసారిగా తిరగబడ్డారు. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు రోడ్డెక్కారు. విషయం తెలుసుకున్న మీడియా కేజీబీవీకి చేరుకొని విద్యార్థులతో ఆరా తీశారు. అయితే కేజీబీవీ నుంచి ఎస్‌ఓ వెళ్లిన తర్వాత వర్కర్లు మద్యం తాగి వచ్చి విద్యార్థినులను అసభ్యంగా దూషించడంతో పాటు చిల్లర చేష్టలు చేస్తున్నారని తెలిపారు. దీనిపై ఎస్‌ఓ వారిని మందలించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతోనే దాడి డ్రామా ఆడుతున్నారన్నారు. ఈ విషయమై ఎస్‌ఓ లలితను వివరణ కోరగా.. వర్కర్లకు 15 రోజులుగా డ్యూటీలు మార్చి కచ్చితంగా చేయాలని చెప్పడంతోనే గొడవకు దిగారని తెలిపారు. వర్కర్ల తీరుపై డీసీడీఓకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

30, 31 తేదీల్లో రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీలో ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్న జి.రాజేంద్రప్రసాద్ స్మారక తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల బ్రోచర్లను మంగళవారం రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి అభివృద్ధి, యువజన క్రీడలశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. చాంపియన్‌షిప్‌ను విజయవంతంగా నిర్వహించాలని వారు సూచించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎస్‌పీ.వెంకటేశ్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు టోనీ మార్టిన్, ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర, కోశాధికారి ఆనంద్‌కుమార్, పీడీలు రమేష్‌బాబు, పి.శ్రీనివాసులు, సి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఆర్టీసీకి గి'రాఖీ'


రాఖీ పండుగ రోజున మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

5 రోజులు.. రూ.16.15 కోట్ల ఆదాయం

- 11వ తేదీన అధికంగా రూ.3.94 కోట్లు
- ఆక్యుపెన్సీ రేషియోలో రాష్ట్రంలోనే మొదటిస్థానం

స్టేషన్ మహబూబ్‌నగర్: రాఖీ పండుగకు మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ రికార్డుస్థాయి ఆదాయం సమకూరింది. పండుగ వేళ వరుస సెలవులు రావడంతో ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు రీజియన్ పరిధిలోని డిపోల నుంచి ప్రత్యేక అదనపు బస్సు సర్వీసులు నడిపారు. ఆయా డిపోల నుంచి హైదరాబాద్ మార్గంలో ఎక్కువ బస్సులు నడపడంతో రీజియన్‌కు అధిక ఆదాయం సమకూరింది.

■ ఈ ఐదు రోజుల్లో ఆక్యుపెన్సీ రేషియాలోనూ రాష్ట్రస్థాయిలో మహబూబ్‌నగర్ రీజియన్ 139 శాతం సాధించి మొదటి స్థానంలో నిలవడం విశేషం. బస్సులు 19.56 లక్షల కిలోమీటర్లు తిరిగి 26.63 లక్షల మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చాయి. గతేడాది కంటే ఈసారి 15 వేల మంది ప్రయాణికులు అదనంగా ప్రయాణం చేశారు. డిపోల పరంగా చూస్తే మహబూబ్‌నగర్ రూ.2,54,98,000, వనపర్తి డిపో రూ.2,26,70,000 అధిక ఆదాయాన్ని పొందాయి.

ప్రతి ఉద్యోగి కృషితోనే..



డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు, ఇతర ఉద్యోగుల సమష్టి కృషితోనే ఆక్యుపెన్సీ రేషియో 139 శాతం సాధించి రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ రీజియన్ మొదటిస్థానంలో నిలవడం సంతోషంగా ఉంది. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు వరలక్ష్మీ వ్రతం, రాఖీ పండుగలకు దూరంగా ఉండి విధులకు హాజరవడం గర్వకారణం. పండుగ రోజుల్లో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్టాండ్లలో పర్యవేక్షణ నిర్వహించాం. ఆర్టీసీపై ఆదరణ చూపించిన ఉమ్మడి జిల్లా ప్రయాణికులకు ధన్యవాదాలు తెలుపుతున్నాం.

– పి.సంతోష్‌కుమార్, రీజినల్ మేనేజర్

తేదీల వారీగా ఇలా.. వచ్చిన ఆదాయం (రూ.లలో..)

తేదీ	ఆదాయం
7 తేదీన	2,16,31,000
8 తేదీన	2,48,37,000
9 తేదీన	3,70,74,000
10 తేదీన	3,85,60,000
11తేదీన	3,94,34,000

డిపోల వారీగా ఆదాయం

డిపో	తిరిగిన కిలోమీటర్లు (లక్షల్లో..)	ఆదాయం (రూ.లక్షల్లో..)
మహబూబ్‌నగర్	3.00	254.98
వనపర్తి	2.54	226.70
కల్వకుర్తి	2.16	182.29
షాద్‌నగర్	1.86	169.65
నారాయణపేట	2.03	163.90
గద్వాల	2.31	159.68
అచ్చంపేట	1.97	157.90
నాగర్‌కర్నూల్	1.81	151.94
కొల్లాపూర్	1.54	122.57
కోస్గి	0.34	25.75

పాఠశాల బస్సుకు తప్పిన ప్రమాదం


బస్సును బయటకు తోస్తున్న గ్రామస్తులు, యువకులు

మక్తల్: మండలంలోని కర్ని చెరువు ప్రస్తుతం అలుగు పారుతోంది. మంగళవారం పాఠశాల బస్సు కల్వర్టు దాటుతుండగా నీటి ప్రవాహానికి ఇంజన్ ఆగిపోవడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన గ్రామస్తులు, యువకులు నీటిలోకి వెళ్లి బస్సును వెనుక నుంచి తోయడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారాన్ని పాఠశాల యాజమాన్యానికి తెలిపారు.